సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025

వాక్‌థాన్‌లో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

వివిధ దేశాల జెండాలతో విద్యార్థులు





అవిశ్వాసానికి రండి.. రూ.కోటి ఇస్తాం!

- డిప్యూటీ మేయర్ కోసం కూటమి కుయుక్తులు
- మహిళా కార్పొరేటర్లకు బంపర్ ఆఫర్
- స్టేట్ డైరెక్టర్ పోస్టులు ఇస్తామంటూ ఫోన్లు
- అయినా తలొగ్గని వైఎస్సార్ సీపీ మహిళా నేతలు



గుర్తింపు కార్డు లేకపోయినా పోలీసుల పరిచయంతో లోపలికి వెళ్లిన కార్యకర్త

సాక్షి, విశాఖపట్నం/డాబాగార్డెన్స్: మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు మ్యాజిక్ ఫిగర్ కోసం కూటమి నేతలు ఎలాంటి ప్రయత్నాలు చేశారో.. ఇప్పుడు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై అవిశ్వాస తీర్మానంలోనూ అదే తరహా పరిస్థితి కొనసాగింది. గతంలో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసాన్ని నెగ్గించుకుని, ఆ పీఠాన్ని దక్కించుకోవడానికి 74 మంది కార్పొరేటర్ల బలం అవసరం కాగా, దాన్ని సాధించేందుకు చివరి నిమిషం వరకు కార్పొరేటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం వంటి ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు 74 మంది బలంతో ఆ అవిశ్వాసం నెగ్గింది. శనివారం జరిగిన డిప్యూటీ మేయర్ పీఠం విషయంలోనూ అదే పరిస్థితి నెలకొంది. డిప్యూటీ మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడానికి 74 మంది కార్పొరేటర్ల మద్దతు అవసరం. ఈ అవిశ్వాస తీర్మానం వీగిపోతుందేమోనన్న భయంతో కూటమి నేతలు చివరి నిమిషం వరకు ప్రలోభాలకు, బెదిరింపులకు పాల్పడ్డారు. తమ వద్ద ఉన్న కార్పొరేటర్లపై పూర్తి విశ్వాసం లేని తెలుగుదేశం, జనసేన, బీజేపీ శాసనసభ్యులు, కార్పొరేటర్లు వైఎస్సార్ సీపీకి చెందిన మహిళా కార్పొరేటర్లను లక్ష్యంగా చేసుకుని ప్రలోభపెట్టే ప్రయత్నం చేశారు. కొందరు మహిళా కార్పొరేటర్లకు ఫోన్లు చేసి, అవిశ్వాస ఓటింగ్‌కు హాజరై, డిప్యూటీ మేయర్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తే బంపర్ ఆఫర్ ఇస్తామంటూ ఆశ చూపారు. రాష్ట్ర స్థాయి డైరెక్టర్ పదవిని కల్పిస్తామని, అదనంగా కోటి రూపాయలు కూడా ఇస్తామని ఫోన్లలో బేరసారాలు జరిపారు. వెంటనే నగదు బదిలీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ఎలాగైనా వచ్చి ఓటు వేయాలని కోరారు. అయితే, కూటమి నేతల ప్రలోభాలకు వైఎస్సార్ సీపీ మహిళా కార్పొరేటర్లు ఏమాత్రం లొంగలేదు. వారి ఆఫర్లను గట్టిగా తిరస్కరించారు. పార్టీ గుర్తుపై గెలిచి, ఇలాంటి వాటికి లొంగే దుర్బుద్ధి తమకు లేదని ఘాటుగా బదులివ్వడంతో కూటమి నేతలు తొకముడిచారు. చివరికి తమ శిబిరంలో ఉన్న 74 మంది కార్పొరేటర్లను బతిమాలుకుని డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస ఓటింగ్‌కు తీసుకొచ్చారు. ఆ 74 మందిని కాపాడుకోవడానికి చివరి నిమిషం వరకు అష్టకష్టాలు పడిన కూటమి.. అవిశ్వాసంలో కేవలం ఒక్క ఓటు మెజారిటీతో విజయం సాధించి బతుకు జీవుడా అని ఊపిరిపీల్చుకుంది. కాగా.. డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని కూడా వైఎస్సార్ సీపీ, సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లు బహిష్కరించారు. గుర్తింపు కార్డు ఉన్నవారికే జీవీఎంసీ ప్రాంగణంలోకి అనుమతిస్తామని కలెక్టర్ ప్రకటించినా.. క్షేత్ర స్థాయిలో ఆయన ఆదేశాలు అమలు కాలేదు. కూటమి చోటా నాయకులు సైతం దర్జాగా జీవీఎంసీలోకి ప్రవేశించడం గమనార్హం.

ఓటింగ్‌ను బహిష్కరించిన వైఎస్సార్ సీపీ



సమావేశమైన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, కార్పొరేటర్లు, ముఖ్యనేతలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌పై శనివారం అవిశ్వాస తీర్మానం సందర్భంగా నిర్వహించిన ఓటింగ్‌ను వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు బహిష్కరించారు. వీరంతా మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు మాట్లాడుతూ డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం విషయంలో కూటమి అడ్డదారుల్లో గెలిచిందని ఆరోపించారు. తమ పార్టీ మహిళా కార్పొరేటర్లకు అర్ధరాత్రి ఫోన్లు చేసి బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం దారుణమన్నారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, కార్పొరేటర్లు జియ్యాని శ్రీధర్, బానాల శ్రీనివాసరావు, దొంపల్లి ఏడుకొండలరావు, కోరుకొండ వెంకట రత్న స్వాతి, కె.అనిల్‌కుమార్ రాజు, నక్కెళ్ల లక్ష్మీ సురేష్, సాడి పద్మారెడ్డి, పల్లా అప్పలకొండ, తోట పద్మావతి, చెన్న జానకిరామ్, గుండాపు నాగేశ్వరరావు, కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్, అల్లు శంకరరావు, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కరజాడ వెంకట నాగ శశికళ, పి.వి.సురేష్, బల్ల లక్ష్మణరావు, గుడివాడ అనూష లతీష్, పార్టీ నాయకులు గొలగాని శ్రీనివాస్, అక్కరమాని మంగరాజు, మొల్లి అప్పారావు, పల్లా దుర్గ, గులిగిందల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వారసత్వాన్ని నిలబెడదాం

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.మధుమూర్తి పిలుపు
- ఏయూ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం
- విజన్ డాక్యుమెంట్, లోగోలు ఆవిష్కరించిన అతిథులు
- ఉత్సవాల్లో భాగంగా బీచ్‌రోడ్డులో వాక్‌థాన్



విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి, వీసీ రాజశేఖర్, తదితరులు

విశాఖ విద్య: ఘనమైన వారసత్వం కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం అభ్యున్నతికి అందరూ సమష్టిగా కృషి చేయాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి పిలుపునిచ్చారు. ఏయూ శతాబ్ది వేడుకల ప్రారంభోత్సవం సందర్భంగా బీచ్‌రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. శతాబ్ద కాలంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం అనేకమంది జీవితాలను ప్రభావితం చేసిందన్నారు. అదే విధంగా యువ మస్తిష్కాలను తీర్చిదిద్దిన ఘనత ఏయూ సొంతమని చెప్పారు. ఇది దేశ ప్రగతికి, ప్రపంచ ప్రగతికి దోహదపడిందన్నారు. తనకు ఇక్కడ చెప్పలేనన్ని అపురూప జ్ఞాపకాలు ఉన్నాయని, విద్యార్థిగా తన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యార్థులకు జ్ఞానంతో పాటు విలువలు ఎంతో అవసరమని చెప్పారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చేదిగా ఈ ప్రయాణం నిలుస్తుందని మధుమూర్తి అన్నారు. జ్ఞాన ఆధారిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. త్వరలో రాష్ట్రంలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు అవుతుందని చెబుతూ.. దాని ప్రాముఖ్యాన్ని వివరించారు. భారతదేశానికి యువ జనాభా ఎంతో లాభదాయకంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్‌లో బోధన విధానాన్ని ఏఐ సాంకేతికత సవాలు చేసే దిశగా మారుతుందన్నారు. విద్య, పరిశోధన, ప్రజాసేవ రంగాల్లో ఏయూ తనదైన శైలిలో ముందుకు వెళ్లాలని సూచించారు. విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. విశిష్ట అతిథి ఐఐటీ పాలక్కాడ్ డైరెక్టర్ ఎ.శేషాద్రి శేఖర్ మాట్లాడుతూ సమగ్ర విద్యను అందించాల్సిన ఆవశ్యకతను గుర్తు చేశారు. ప్రాథమిక సూత్రాలు, శాస్త్ర సంబంధ అంశాలపై బలమైన పట్టు సాధించడం ఎంతో అవసరమని, అదే విధంగా సాఫ్ట్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా తాను ఈ స్థానంలో నిలవడానికి గల కారణం, సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ప్రతి విద్యార్థి జాతీయ విద్యా విధానం డాక్యుమెంట్‌ను చదవాలని సూచించారు. ఏయూ ప్రగతికి తాను సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రకటించారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ దార్శనికుల వారసత్వం, నాయకత్వం ఏయూను

మిగతా IIవ పేజీలో ▶

విశ్రాంత ఆచార్యులకు సత్కారం

ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు **సీహెచ్ శాంతమ్మ, ఆ**చార్య బి.ప్రసాద్ రావు**లను ఈ సందర్భంగా** సత్కరించారు. అనం**తరం ఆచార్య** ప్రసాదరావు చేసిన **స్ఫూర్తిదాయక ప్ర**సంగం విద్యార్థుల మనసు**లను హత్తుకుంది.** ఆంధ్ర విశ్వవిద్యాలయ **రుణం తీర్చుకోవాలని**, విలువలతో కూడిన **విద్యను అందించాలని** ఉద్దేశంతో తాను స్థాపిం**చిన పాఠశాల అభివృ**ద్ధిని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఏయూ విజన్ డాక్యుమెంట్, లోగోలను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమం ఆరంభంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పలువురు పూర్వ ఉపకులపతులు, విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఆచార్యులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు.

'మత్స్యకారుల సేవలో' చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: 'మత్స్యకారుల సేవలో' పథకం 2025–26 కింద జిల్లా నుంచి 12,138 మంది లబ్ధిదారులకు రూ.20 వేల చొప్పున రూ.24,27,60,000ను ప్రభుత్వం మంజూరు చేసింది. శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెంలో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించగా, ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీసీ హాలు నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, మత్స్యకారులు వీక్షించారు. సీఎం ప్రసంగం అనంతరం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ లబ్ధిదారులకు ఈ మొత్తం చెక్కును అందజేశారు. మత్స్యకార సంఘాల ప్రతినిధులు, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోజ్‌గార్ మేళాలో 278 మందికి నియామక పత్రాలు



నియామకపత్రాలను అందజేస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

తాటిచెట్లపాలెం: దేశవ్యాప్తంగా 15వ రోజ్‌గార్ మేళా శనివారం వివిధ ప్రాంతాల్లో జరిగింది. ఇందులో భాగంగా విశాఖపట్నం సాలగ్రామపురంలోని సాగరమాల పోర్ట్ ఆడిటోరియంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా మాట్లాడుతూ, యువత దేశ నిర్మాణంలో చురుగ్గా పాల్గొన్నప్పుడే దేశం వేగవంతమైన అభివృద్ధిని సాధిస్తుందని, ప్రపంచ వేదికపై గుర్తింపు లభిస్తుందని అన్నారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు 278 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్, జీఎస్టీ జోన్ చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ, కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీధర్, సీజీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్, నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, పరోక్ష పన్నులు, మాదక ద్రవ్యాల(నాసిన్) అదనపు డైరెక్టర్ జనరల్ ఈదర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకుంటే భవిత

- అడ్వెంట్ ఇంటర్నేషనల్ ఆపరేటింగ్ పార్టనర్ శివకుమార్
- ఘనంగా ఐఐఎం ఈఎంబీఏ ప్రత్యేక స్నాతకోత్సవం
- 124 మందికి పట్టభద్రులకు అవార్డులు



మాట్లాడుతున్న అడ్వెంట్ ఇంటర్నేషనల్ ఆపరేటింగ్ పార్టనర్ శివకుమార్

బీచ్‌రోడ్డు: వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవడం వల్ల వ్యక్తిగత వృద్ధితోపాటు సంతృప్తిని పొందవచ్చని అడ్వెంట్ ఇంటర్నేషనల్ ఆపరేటింగ్ పార్టనర్ డి.శివకుమార్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎం) ఈఎంబీఏ ప్రత్యేక స్నాతకోత్సవాన్ని శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ–విలువను స్వతంత్రంగా నిర్వచించుకోవాలన్నారు. పోలికల ఒత్తిళ్లను నిరోధించాలని సూచించారు. మోసపూరిత సిండ్రోమ్‌ను అధిగమించడం ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. ఐఐఎం గవర్నర్ల బోర్డు సభ్యుడు ప్రొఫెసర్ జనత్ షా మాట్లాడుతూ వ్యాపారం ద్వారా సానుకూల సామాజిక ప్రభావాన్ని సృష్టించడం, వాటి ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ డైరెక్టర్ నివేదికను సమర్పించారు. ఒక ముఖ్యమైన మైలురాయిని గుర్తుచేసేందుకు ప్రత్యేక స్నాతకోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర నిధులతో నడిచే సాంకేతిక సంస్థలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థలు (పీజీపీఎంసీఐ)ల్లో పనిచేస్తున్నవారు కోసం ప్రారంభించిన ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ (ఈఎంబీఏ), పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సులను వీరంతా దిగ్విజయంగా పూర్తి చేశారన్నారు. అభ్యర్థుల్లో సుమారు 70 శాతం మంది వ్యూహాత్మక ఆలోచన, విస్తృత వ్యాపార దృక్పథాలు, మెరుగైన విశ్వాసం, విశ్వసనీయతలో మెరుగుదలను నివేదించారని పేర్కొన్నారు. దాదాపు 60 శాతం మంది తమ నాయకత్వ సామర్థ్యాల్లో వృద్ధిని చూశారన్నారు. 27 శాతం మంది గ్రాడ్యుయేట్లు ప్రమోషన్లు లేదా కొత్త అవకాశాల ద్వారా కెరీర్ పురోగతిని సాధించారన్నారు.

ఇద్దరికి గోల్డ్ మెడల్

ఈఎంబీఏ ప్రోగ్రామ్ నుంచి మొత్తం 124 మంది విద్యార్థులు పట్టభద్రులయ్యారు. ఈ కోర్సులో అగ్రస్థానంలో నిలిచిన నవనీత్ బత్రాకు, రెండో స్థానంలో నిలిచిన అనిర్బన్ దత్తాకు గోల్డ్ మెడల్‌ను అందజేశారు. వేడుకలో సుమారు 200 మంది గ్రాడ్యుయేట్లను సత్కరించారు.

చందనోత్సవం టికెట్ల విక్రయాల్లో గందరగోళం

- సింహగిరిపైన, బ్యాంకుల్లోనూ లభించని రూ.1000 టికెట్లు
- ఆన్‌లైన్‌లో కూడా దొరకని వైనం

సింహాచలం: చందనోత్సవం టికెట్ల విషయంలో గందరగోళం నెలకొంది. ఈనెల 30న జరిగే ఉత్సవం కోసం రూ.300, రూ.1000 టికెట్లను ఈనెల 24 నుంచి విక్రయిస్తామని ప్రకటించినా, తొలిరోజు సింహాచలం కొండపైన, రెండు బ్యాంకుల్లోనే అమ్మకాలు జరిగాయి. నగర బ్యాంకులకు టికెట్లు ఆలస్యంగా చేరాయి. శనివారం నాటికి రూ.1000 టికెట్లు కొండపైనా, బ్యాంకుల్లోనూ అందుబాటులో లేకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఉదయం 3.30 నుంచి రూ.1000 దర్శన స్లాట్ టికెట్లు ఎక్కడ దొరుకుతాయని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆన్‌లైన్‌లోనూ టికెట్లు లేవని వాపోతున్నారు. మరోవైపు రూ.1,500 టికెట్లపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. వీఐపీల టికెట్లను కలెక్టర్ నిర్ణయిస్తారని ఈవో సుబ్బారావు చెబుతున్నప్పటికీ, కేవలం సిఫార్సు లేఖలను మాత్రమే దేవస్థానం కార్యాలయంలో తీసుకుంటున్నారు. ఇప్పటికే దాదాపు 400కు పైగా సిఫార్సు లేఖలు వచ్చాయని, మరో 200 వరకు వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఈ టికెట్లను ఏ ప్రాతిపదికన జారీ చేస్తారో?

కేజీహెచ్‌ని అభివృద్ధి చేస్తాం

సీఎం చంద్రబాబు



సెంటనరీ భవనాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి, విశాఖపట్నం: కేజీహెచ్‌ని అభివృద్ధి చేసి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మార్చుతామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాలలో పూర్వ విద్యార్థులు నిర్మించిన సెంటనరీ భవనాన్ని శనివారం రాత్రి ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ ఆడిటోరియం, డిజిటల్ లైబ్రరీ, విజ్ఞాన పరిశోధన కేంద్రాలను రిమోట్ సాయంతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ కేజీహెచ్ అభివృద్ధికి అవసరమైన రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని ఉన్నతాధికారుల్ని ఆదేశించినట్లు తెలిపారు. కేజీహెచ్‌లో ప్రత్యేక క్యాన్సర్ బ్లాక్ రాబోతోందన్నారు. వైద్య రంగంలోనూ టెక్నాలజీ ఇంటిగ్రేషన్ జరగాలని సూచించారు. మెడిసిన్ చదువుకున్న వారు కూడా పీజీకి అనుబంధంగా టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. పూర్వ విద్యార్థులు కలిసికట్టుగా తాము చదివిన కళాశాలలను అభివృద్ధి చేస్తుండటం ప్రశంసనీయమన్నారు. నాలెడ్జ్ ఎకానమీకి చిరునామాగా ఏఎంసీ అభివృద్ధి చెందాలని సూచించారు. ఆన్‌లైన్ విధానంలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందించే వ్యవసను తీసుకొచ్చేందుకు ప్రతి వైద్యుడు కృషి చెయ్యాలని చంద్రబాబు అన్నారు. మంత్రులు డోలా బాలావీరాంజనేయ స్వామి, వంగలపూడి అనిత, సత్యకుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

చందనోత్సవ భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

డాబాగార్డెన్స్: చందనోత్సవం నేపథ్యంలో ఈ నెల 30న ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు శనివారం తెలిపారు. గోశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, పాత పోస్టాఫీస్, ఆర్కే బీచ్, కొత్తవలస, చోడవరానికి 60 బస్సులు, అడవివరం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్కే బీచ్‌కు 20 బస్సులు, అడవివరం నుంచి విజయనగరానికి 20 బస్సులు నడుస్తాయి. గోశాల నుంచి సింహాచలం కొండకు 35 బస్సులు, అడవివరం నుంచి కొండకు 13 బస్సులు, అడవివరం నుంచి గోశాలకు 3 బస్సులు నడపనున్నామన్నారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమయ్యారు.

సవాల్‌గా జంట హత్య కేసు

- రాజీవ్‌నగర్‌లో దంపతుల దారుణ హత్య
- 8 బృందాలతో పోలీసుల దర్యాప్తు


మెకానిక్‌లను విచారిస్తున్న పోలీసులు

కూర్మన్నపాలెం: గాజువాకకు సమీపంలోని రాజీవ్ నగర్‌లో జరిగిన జంట హత్యల కేసు పోలీసు యంత్రాంగానికి సవాలుగా మారింది. దుండగులు ఎక్కడా ఎలాంటి ఆనవాళ్లు వదలకుండా.. అత్యంత పకడ్బందీగా నేరానికి పాల్పడటంతో కేసు ఛేదన పోలీసులకు తలనొప్పిగా మారింది. ఉన్నతాధికారులు సైతం రంగంలోకి దిగి కేసు దర్యాప్తును అన్ని కోణాల్లోనూ నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

హత్యకు గురైన యోగేంద్రబాబు(66), ఆయన భార్య లక్ష్మి(58) సుమారు 40 ఏళ్లుగా రాజీవ్‌నగర్ ప్రాంతంలోనే నివాసం ఉంటున్నారు. యోగేంద్రబాబు నావల్ డాక్‌యార్డ్‌లో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందారు. స్థానిక గ్లోరియా(ఎయిడెడ్) పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పనిచేసి రిటైర్ అయిన లక్ష్మి స్థానికంగా మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. వారికి ఎవరితోనూ ఎలాంటి శత్రుత్వం లేదని స్థానికులు చెబుతున్నారు. వారి ఇద్దరు పిల్లలు శృతి, సుజన్ వివాహాలు చేసుకుని అమెరికాలో స్థిరపడటంతో.. ఇంట్లో వీరిద్దరు మాత్రమే ఉంటున్నారు. ఎవరితోనూ గొడవలు లేని వీరిని ఇంత దారుణంగా ఎవరు, ఎందుకు హత్య చేశారన్నది అంతుపట్టని ప్రశ్నగా మారింది.

బంగారం కోసమా?

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘటన జరిగిన ఇంటి ముందు, వెనుక తలుపులకు బయట నుంచి తాళాలు వేసి ఉన్నాయి. ఇంటి ప్రధాన ద్వారం తెరవగానే యోగేంద్రబాబు మృతదేహం కనిపించింది. లక్ష్మి మృతదేహం బెడ్‌రూమ్‌లో ఉంది. ఇంట్లో వస్తువులు కూడా చెల్లాచెదురుగా పడిలేవు. బీరువా తాళాలు కూడా పగలగొట్టినట్లు కనిపించలేదు. ఇది పోలీసులను మరింత గందరగోళానికి గురిచేస్తోంది. సాధారణంగా దొంగతనాలు జరిగితే ఇంట్లోని వస్తువులు అస్తవ్యస్తంగా ఉంటాయి. బీరువాలు పగలగొడతారు. కానీ ఇక్కడ అలాంటి పరిస్థితి లేదు. అయితే హతురాలి మెడలో ఎప్పుడూ ఉండే నల్లపూస గొలుసు కనిపించలేదని స్థానికులు చెబుతున్నారు. బహుశా బంగారం కోసమే ఈ హత్య జరిగి ఉండవచ్చనే ఓ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయినప్పటికీ ఇతర విలువైన వస్తువులు జోలికి వెళ్లకపోవడం అనుమానం కలిగిస్తోంది.

వెలగని వీధిలైట్లు.. పనిచేయని సీసీ కెమెరాలు

హత్యకు గురైన దంపతులు గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చారు. అక్కడ గ్లోరియా పాఠశాల అడ్మిన్‌కు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొని వచ్చినట్లు సమాచారం. పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్న దాని ప్రకారం గురువారం రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో ఈ హత్య జరిగి ఉండవచ్చు. అదే సమయంలో రాజీవ్‌నగర్‌లో గ్రామదేవత పండగ జరుగుతుండటంతో ఆ పరిసరాలు కాస్త సందడిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే దుండగులు తమ పని కానిచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు. శుక్రవారం రాత్రి వరకు ఈ దారుణం వెలుగులోకి రాలేదు. మృతుల బంధువుల కుమార్తె వారిని కలవడానికి ఇంటికి వచ్చినప్పుడు, ఇంటికి తాళం వేసి ఉండటం, లోపల ఫోన్ మోగుతుండటంతో ఆమెకు అనుమానం వచ్చింది. దీంతో ఆమె వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు వచ్చి తలుపులు తెరవగా ఈ ఘోరం వెలుగుచూసింది. ఘటన జరిగిన సమయంలో పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పని చేయకపోవడం, వీధి లైట్లు వెలగకపోవడం వంటివి దర్యాప్తునకు ఆటంకాలు కలిగిస్తున్నాయి. వారి పిల్లలు అమెరికా నుంచి వచ్చిన తర్వాతే ఇంట్లో ఏయే వస్తువులు, ఎంత నగదు, బంగారం పోయిందనే వివరాలు కచ్చితంగా తెలుస్తాయని పోలీసులు చెబుతున్నారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు

కేసు ఛేదనకు క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు నేతృత్వంలో నగర క్రైం పోలీసులు, ఇన్‌స్పెక్టర్లు రాజీవ్‌నగర్‌లోనే మకాం వేసి జల్లెడ పడుతున్నారు. ఇప్పటికే 8 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కేసులో కీలక ఆధారంగా భావిస్తున్న మిస్సింగ్ స్కూటీపై పోలీసులు దృష్టి సారించారు. గతంలో రిపేర్ కోసం మెకానిక్‌లు వచ్చి స్కూటీని తీసుకెళ్లేవారని తెలియడంతో, స్థానిక మెకానిక్‌లందరినీ శనివారం సంఘటనా స్థలానికి పిలిపించారు. హతుల బంధువులతో గుర్తింపు పరేడ్ నిర్వహించారు. అయితే వారెవరూ హతులకు తెలిసిన వారు కాదని బంధువులు చెప్పడంతో పోలీసులు మరో కోణంలో దర్యాప్తు మొదలుపెట్టారు. మెకానిక్ కాకుండా మరెవరైనా స్కూటీని తీసుకెళ్లే అవకాశం ఉందా అనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు. మృతుల ఇంటి ముందు టు-లెట్ బోర్డు ఉండటంతో.. అద్దెకు కావాలని ఎవరైనా ఇంటి యజమానులను సంప్రదించారా అనే వివరాలను కూడా సేకరించారు. ఇదిలావుండగా దర్యాప్తులో భాగంగా మృతులిద్దరి సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలోని కాల్ డేటా, ఇతర సమాచారాన్ని విశ్లేషిస్తున్నారు. నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ కూడా సంఘటనా స్థలం నుంచి కొంత దూరం వరకు వెళ్లి వెనుతిరిగి వచ్చింది. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పంచనామా నిర్వహించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు.. దర్యాప్తును ముమ్మరం చేశారు.


యోగేంద్రబాబు, లక్ష్మి దంపతులు(ఫైల్)

మద్యం దుకాణం వద్దంటూ మహిళల ఆందోళన


ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న మహిళలు

కంచరపాలెం: ఇందిరానగర్-5 ప్రాంతంలోని జనావాసాల మధ్య మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ మహిళలు ఆందోళనకు దిగారు. కంచరపాలెం జాతీయ రహదారికి ఆనుకుని సబ్‌వే పక్కన ఓ టిఫిన్ దుకాణంలో ఎస్వీఆర్ వైన్స్ పేరుతో మద్యం దుకాణాన్ని ప్రారంభించే ప్రయత్నం జరిగింది. దీంతో ఇందిరానగర్-5 కాలనీ మహిళలు మద్యం దుకాణం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. జనావాసాలు, ఆలయాలకు దగ్గరలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ప్రయత్నించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నాయకుల అండతోనే ఇదంతా జరుగుతోందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ధర్మాల ఆనందకుమార్ రెడ్డి, స్థానిక మహిళా నాయకులు పద్మ, అమ్మాజీ, మణి నేతృత్వంలో దుకాణం ముందు టెంట్లు వేసి, ప్లకార్డులతో 'మద్యం దుకాణం వద్దు-భద్రతే మాకు ముద్దు'అంటూ నినాదాలు చేశారు. జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చినబాబు, యశోదరావు, త్రినాథ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగఫలం ఏయూ

- బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహణ


బీచ్‌రోడ్డులో వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న వీసీ రాజశేఖర్

ఏయూక్యాంపస్/విశాఖ విద్య: ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్, పూర్వ ఉపకులపతులు, ఏయూ అధికారులతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్కె బీచ్ నుంచి ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఏయూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా ఏర్పడిందన్నారు. వచ్చే సంవత్సరం ఇదే రోజున శతాబ్ది ఉత్సవాల వేడుకను ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఏయూ విద్యార్థులు, ఆచార్యులు, సిబ్బంది ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు, మాజీ వీసీలు ఆచార్య బీల సత్యనారాయణ, జి.ఎస్.ఎన్. రాజు, వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, వి.బాలమోహన్ దాస్, ఆర్.సుదర్శన రావు, ఎస్.రామకృష్ణ రావు, ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ కె.వి.వి.రావు పాల్గొన్నారు. ఏయూ పరిపాలన భవనం వద్ద జరిగిన ప్రారంభోత్సవంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొన్నారు.



భార్యతో గొడవ పడి బలవన్మరణం

మేడపై నుంచి దూకి భర్త మృతి


గోవింద్ మృతదేహం

మల్కాపురం: భార్యతో జరిగిన స్వల్ప వాగ్వాదంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి తన ఇంటి మేడపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ కాలనీలో జరిగింది. సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలివి. జీవీఎంసీ 61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీలో తుంపాల గోవింద్ (50) తన భార్య లీలారాణి, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటున్నాడు. గోవింద్ మస్కట్, దుబాయ్ వంటి దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లి వస్తుంటాడు. ఇటీవల మస్కట్ నుంచి తిరిగి వచ్చిన గోవింద్.. తన స్నేహితులతో కలిసి తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి వచ్చాడు. గత కొంతకాలంగా గోవింద్ దంపతుల మధ్య చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. శనివారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో మద్యం సేవించి ఉన్న గోవింద్.. ఇంటి హాల్లో టీవీని పెద్ద శబ్దంతో చూస్తున్నాడు. అదే సమయంలో గదిలో పిల్లలతో నిద్రిస్తున్న ఆయన భార్య లీలారాణి ఆ శబ్దానికి ఇబ్బంది పడింది. దీంతో బయటకు వచ్చి ఎందుకు అంత పెద్ద శబ్దంతో టీవీ చూస్తున్నావని ప్రశ్నించింది. దీనిపై ఇద్దరి మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన గోవింద్ ఇంటి రెండో అంతస్తు పైకి పరుగు తీసి.. అక్కడి నుంచి కిందకు దూకాడు. తీవ్ర గాయాలపాలైన గోవింద్‌ను చూసి లీలారాణి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చారు. వెంటనే కుటుంబ సభ్యుల సహాయంతో గోవింద్‌ను స్థానిక సెయింట్ ఆన్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, అప్పటికే గోవింద్ మరణించినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు జరుగుతోంది. కాగా.. పది రోజుల క్రితం ఇదే ప్రాంతంలో దుస్తులు ఆరేస్తూ మేడపై నుంచి జారిపడి కోమలి అనే మహిళ మరణించింది.

ఏయూ వారసత్వాన్ని నిలబెడదాం

▶ Iవ పేజీ తరువాయి

నడిపిస్తోందన్నారు. అకడమిక్, మౌలిక సదుపాయాలు, ఔట్రీచ్ రంగాల్లో ఏయూ మరింత పటిష్టంగా పనిచేస్తుందన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగాలను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. సహ పాఠ్య కార్యక్రమాల ప్రాధాన్యత గుర్తించి వాటిని విద్యలో భాగం చేస్తామని తెలిపారు. ఏడాది పొడుగునా నిర్వహించే శతాబ్ది వేడుకల్లో నోబెల్ గ్రహీతలను ఆహ్వానిస్తామని వీసీ చెప్పారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ దీర్ఘకాలిక లక్ష్యాలను ఏర్పరచుకుంటూ వాటిని సాధించే దిశగా పని చేయాలని సూచించారు. పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ కె.వి.వి.రావు మాట్లాడుతూ ప్రజల జీవితాన్ని మార్చిన వ్యవస్థగా ఏయూను చెప్పవచ్చన్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్ ధనుంజయరావు తదితరులు ప్రసంగించారు.

శతాబ్ది ఉత్సవాల లోగో రూపకర్త ఏయూ విద్యార్థి



విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల లోగోను క్యాంపస్ ఫైన్‌ఆర్ట్స్ విభాగం బీఎఫ్ఏ విద్యార్థి షేక్ రఫీ రూపొందించారు. ఈ లోగో రూపకల్పన కోసం వీసీ ప్రత్యేక కమిటీని నియమించారు. వర్సిటీలో ఆసక్తి ఉన్న ఆచార్యులు, విద్యార్థులతో లోగోను తయారు చేయించారు. శతాబ్ది ఉత్సవాలకు అద్దం పట్టేలా సిద్ధం చేసిన మూడు లోగోలను కమిటీ సభ్యులు ఎంపిక చేసి.. వాటిని వీసీ ముందుంచింది. వీటిలో ఫైన్ ఆర్ట్స్ విద్యార్థి షేక్ రఫీ రూపొందించిన లోగోను ఎంపిక చేసి.. శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ వేదికపై అతిథులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ రఫీను సత్కరించారు.

మేయర్ ఎన్నికకు పక్కా ఏర్పాట్లు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ మేయర్ ఎన్నికకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావివ్వొద్దని జాయింట్ కలెక్టర్, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మయూరి అశోక్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌ను శనివారం సందర్శించిన ఆయన.. ఎన్నికల ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి మేయర్ ఎన్నిక ప్రక్రియ చేపడతామన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉదయం 10.30 గంటలకు తమ గుర్తింపు కార్డులతో హాజరు కావాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రత్యేక సమావేశంలోకి సంబంధిత సభ్యులు మినహా ఇతరులెవరినీ అనుమతించబోమన్నారు.

ఏరోస్పేస్ రంగానికి గ్లోబల్‌హబ్‌గా ఏపీ


ప్రసంగిస్తున్న సతీష్ రెడ్డి

ఏయూక్యాంపస్: ఏరోస్పేస్, రక్షణ, నావికాదళ ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ హబ్‌గా మారుతుందని డీఆర్‌డీవో పూర్వ చైర్మన్, రాష్ట్ర ఏరోస్పేస్, డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగం సలహాదారు డాక్టర్ జి.సతీష్ రెడ్డి అన్నారు. సీఐఐ విశాఖ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరర్స్‌తో సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఇన్నోవేషన్ క్లస్టర్లు, ఏఐ, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, నీటిలోపల వ్యవస్థలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల అభివృద్ధి ప్రాముఖ్యతను తెలిపారు. విశాఖ నగరం నీటిలోపల అవసరమైన ఉపకరణాలు ఉత్పత్తి, ఆవిష్కరణలకు భవిష్యత్ కేంద్రంగా నిలుస్తుందన్నారు. సీఐఐ విశాఖ చైర్మన్ డి.వి.ఎస్. నారాయణ రాజు, ఎస్ఐడీఎం ఆంధ్రప్రదేశ్ శాఖ చైర్మన్ జె.శ్రీనివాస రాజు, రక్షణ రంగ పరిశ్రమల ప్రతినిధులు, విధానాల రూపకర్తలు, సాంకేతిక ఆవిష్కర్తలు, ఎంఎస్ఎంఈ ప్రతినిధులు పాల్గొన్నారు.

గాదిరాజు ప్యాలెస్‌లో బ్రాండెడ్ దుస్తుల అమ్మకాలు


దుస్తులు కొనుగోలు చేస్తున్న నగర వాసులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న లగ్జరీ బ్రాండెడ్ దుస్తుల అమ్మకాలకు నగర వాసుల నుంచి విశేష స్పందన లభించింది. 40 వేలకు పైగా దుస్తులను 90 శాతం తగ్గింపు ధరలతో ఈ అమ్మకాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఈ అమ్మకాలు ప్రారంభం కాగా మూడు రోజులపాటు అమ్మకాలు జరగనున్నాయి. అంతర్జాతీయ బ్రాండ్‌లకు చెందిన రెడీమేడ్ దుస్తులను ఇక్కడ అందుబాటులో ఉంచారు. కుటుంబం మొత్తానికి అవసరమైన దుస్తులతో పాటు పెళ్లి సీజన్‌కు అవసరమైన దుస్తులు అందుబాటులో ఉన్నాయి. జీన్స్, టీషర్ట్స్, లేడీస్ కుర్తాలు, వెస్టర్న్ వేర్, ఆఫీస్ వేర్, కిడ్స్ వేర్ ఇలా అన్ని తరగతులకు చెందిన ఆకర్షణీయమైన దుస్తులను విక్రయిస్తున్నారు. దీంతో పాటు బ్రాండెడ్ స్పోర్ట్స్ వేర్, ఫుట్ వేర్ కూడా అందుబాటులో ఉంది. పురుషులకు రూ.200 నుంచి రూ.1,200 వరకు మహిళలకు రూ.200 నుంచి రూ.800 వరకు, పిల్లలకు రూ.150 నుంచి రూ.600 వరకు ధరల్లో అందిస్తున్నారు. ఈ నెల 28 వరకు ఉదయం 8 గంటల నుంచి రాత్రి

అండర్-19 క్రికెట్ జట్ల ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: విశాఖ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో మే 16 నుంచి మూడు రోజుల పాటు జిల్లా అండర్ 19 జట్టు ఎంపిక జరగనుంది. 2006 సెప్టెంబర్ ఒకటో తేదీన గాని తర్వాత గాని జన్మించిన వారు ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని సంఘం కార్యదర్శి పార్థసారథి తెలిపారు. మున్సిపల్ స్టేడియంలోని కార్యాలయంలో ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.